

# అక్కడే ఆగక

## – మల్లాది వెంకట కృష్ణమూర్తి

*(గత సంచిక తరువాయి)*

**ఆరోజు చర్చ్‌లోంచి** స్పీకర్లో పాటలు వినపడగానే ఆద్య అక్కడికి బయలుదేరింది. ఆ రోజు సెర్మన్‌లో పాస్టర్ చెప్పాడు.

"న్యూ గినియా దేశంలోని ప్రకృతి ఆరాధన ఆచారం ప్రకారం స్థానికులు తీవ్ర నృత్య సంగీతాల్లో పాల్గొంటారు. భావోద్వేగాల్లో మునిగి మృత్యుగీతాన్ని ఆలపిస్తారు. అందులో వాళ్ళు తాము చంపాలనుకునే, తాము ద్వేషించే మనుషుల పేర్లని పాడతారు. కాని ప్రకృతి ఆరాధననించి వారు క్రిస్టియన్ మతంలోకి మారాక వారి ఆచారంలో మార్పు వచ్చింది. ఆ మృత్యుగీతంలో తాము నాశనం చేయాలనుకున్న మనుషుల పేర్లని కాక, తమని ద్వేషానికి పురికొలిపే తమలోని పాపాలని నాశనం చేయమని పాడసాగారు. దటీజ్ ది పవర్ ఆఫ్ క్రైస్ట్. ఆమెన్."

"ఆమెన్."

"సౌత్ అమెరికాలోని పెరూలో ఏటా డిసెంబర్ 25న క్రిస్మస్‌తోపాటు 'తకనకి'ని కూడా జరుపుకుంటారు. పాత పగలు కలవారు ఆ రోజు ఒకర్నొకరు సవాలు చేసుకుని పోట్లాడుకుని చివరకి శాంతిని నెలకొల్పుకుంటారు. తర్వాత ఎవరిదారిన వాళ్ళు వెళ్తారు. ఆ తర్వాత ఆ అంశం మీద మళ్ళీ పోట్లాడుకోరు. ప్రస్తావించరు. అంతటితో అది సరి. ఇది జీసస్ మీద ప్రేమని చూపించే గొప్ప విధానం.

"ఘానా దేశపు జాతీయ గీతంలోని మొదటి వాక్యం 'గాడ్! బెల్స్ అవర్ హోం లేండ్, ఘానా!' యుగాండా జాతీయ గీతం, 'ఓ యుగాండా! మే గాడ్ అప్‌హోల్డ్ దీ.' సౌత్ ఆఫ్రికా జాతీయ గీతం 'లార్డ్! బ్లెస్ అవర్ నేషన్.' నైజీరియా జాతీయగీతం 'ఓ గాడ్ ఆఫ్ క్రియేషన్! డైరెక్ట్ అవర్ నోబుల్ కా' ఇలా జాతీయ గీతంలో ప్రార్ధనని ఆఫ్రికన్ దేశాలని స్థాపించిన చాలామంది జాతి పితలు చేర్చారు. కారణం వారికి దేవుడే సృష్టికర్త, పోషకుడు అని తెలుసు. ఐనా ఈ రోజు 'ఇన్ గాడ్ వి ట్రస్ట్' అనే మోటోతో స్థాపించిన అమెరికాతో సహా చాలా దేశాల నేతలు, ప్రజలు దేవుడ్ని విస్మరిస్తున్నారు. మీరెందుకు చర్చ్‌కి రావాలంటే, చివరకి మీరు ఆయన్ని చేరుకున్నాక ఆయన మిమ్మల్ని, 'నువ్వెవరు?' అని అడక్కుండా ఉండాలని.

"భూమిమీది సుగుణాల్లో ఏది స్వర్గంలో కూడా అవసరమౌతుంది? ధైర్యం? ఊహూ. స్వర్గంలో ధైర్యంగా ఉండటానికి భయపడేవేమీ ఉండవు. ఆశ? దాని అవసరం కూడా ఉండదు. మనకి కావాల్సినవన్నీ తక్షణం అక్కడ సమకూరుతాయి. దయ? దాతృత్వం? అదీ అవసరం ఉండదు. అక్కడ దాహం, ఆకలి, లేమి, నగ్నత్వం, కూడు, గుడ్డ, నీడ లేకపోవడంలాంటివి జరగవు. సానుభూతి? ఊహూ. అక్కడ ఎవరికీ కష్టాలు, కన్నీళ్ళు ఉండవు. కృతజ్ఞత? అక్కడ ఎవరూ ఎవరికీ ఏం సహాయం చేయాల్సిన అవసరం ఉండదు. కాబట్టి దాని అవసరం కూడా ఉండదు. క్షమ? అవును. అక్కడ ఇతరులని భూమిమీద మనకి చేసిన ద్రోహానికి క్షమించే అవకాశం ఉంటుంది. 'వీళ్ళేం చేస్తున్నారో వీరికి తెలీదు తండ్రీ. వీరిని క్షమించు' అని జీసస్ తనని శిలువ వేసేవారి గురించి ప్రార్థించలేదా? మీకు జీవితంలో చాలాసార్లు చాలామంది ద్రోహం చేసుంటారు. వారిని క్షమించండి. ఆమెన్."

ఇండియాలో ఆద్య టి.విలో కొన్ని ప్రవచనాలని తల్లి వింటూంటే విన్నది. వాటిలో హనుమంతుడి గుళ్ళో ప్రదక్షిణ సమయంలో చదవాల్సిన శ్లోకం, భగవంతుడి నామం మంచం మీద పడుకుని స్మరించవచ్చా? శివుడికి సాష్టాంగ ప్రమాణం చేయకూడదు. నందివైపు కాళ్ళుండటం మహాపాపం. పూజగదిలో దీపపు కుందెలోని వత్తులు ఏ దిశవైపు ఉంచాలి? ఎన్నుండాలి? భగవద్గీత పుస్తకాన్ని రాత్రుళ్ళు తలకింద ఎందుకు ఉంచుకోవాలి? లేదా వైకుంఠానికి చేరుకోవడమే ధ్యేయమని చెప్పడం లాంటివి విన్నది. అవి విశ్వాసాలే తప్ప జీవితంలో పనికొచ్చేవి ఒక్కటీ లేదని, చర్చ్‌లో చెప్పే మతంతో సంబంధం లేని, ఎవరైనా అర్థం చేసుకోగల మంచి లక్షణాలని బోధించే అంశాలని వింటూంటే ఆద్యకి అనిపించింది. వాటిని తెలివిగా చివరకి జీసస్‌కి ముడిపెట్టినా అవన్నీ ఆలోచించదగ్గ అంశాలు. కోతి కనపడితే ఎందుకు నమస్కరించాలి? లాంటివి జీవితంలో అట్టే ఉపయోగించనివి. ఇంక తను అలాంటి మంచి మాటలు అట్టే రోజులు వినలేనని ఆద్య బయటకి వస్తూ అనుకుంది.

ఆమె తిరుగు ప్రయాణం దగ్గర పడింది.

## 22

సాయంత్రం ఇస్త్రీ చేసిన బట్టలతో అన్నస్థాషియా వచ్చింది. ఆమె వేసుకున్న పెద్ద పూసల గొలుసుని చూసి చెప్పింది.

"నీ గొలుసు చాలా బాగుంది."

"దీన్ని మా నాయనమ్మ నాకు ఇచ్చింది. మా తాతది కెన్యా. ఇక్కడికి వలస వచ్చాడు. మాకు రంగు రంగుల పూసల గొలుసులంటే  బాగా ఇష్టం. పెళ్ళయ్యాక ఎవరికి ఎక్కువ గొలుసులుంటే వాళ్ళ స్థాయి ఇతరులముందు అంతగా పెరుగుతుంది. కొంటే ఖరీదు కాబట్టి స్వయంగా మేమే పూసలతో ఈ గొలుసులని చేసుకుంటాం. ఈ దండని మా నాయనమ్మే స్వయంగా గుచ్చింది. ఇది ఆరు వరసల గొలుసు. ఇలాంటి పన్నెండు వరసల గొలుసులు కూడా ఉంటాయి.

ఇంకోటి కూడా చెప్పనా! మా తాతయ్య మా నాయనమ్మని బాగా దంచేవాడు. మాలో మొగుళ్ళంతా పెళ్ళాలని చావబాదుతారు" అనస్థాషియా నవ్వుతూ చెప్పింది.

"అయ్యో! ఎందుకలా?" ఆద్య బాధగా అడిగింది.

"అది సంప్రదాయం. అప్పుడే వాడు మగాడు. పెళ్ళాం ఏడుపులు, అరుపులు వింటే పక్కవాళ్ళు ఆ మొగుడ్ని అంత మగసిరిగలవాడిగా గౌరవిస్తారు."

"ఇదేం పిచ్చి?" ఆద్య ఆశ్చర్యంగా అడిగింది.

"పెళ్ళాం చాటు మొగుడు కాదని ఋజువు చేసుకోడానికి."

"ప్రేమించి పెళ్ళి చేసుకున్నా కొడతారా? అసలు మీలో ప్రేమ వివాహాలుంటాయా?"

"తక్కువ. అప్పుడు కట్నం ఇవ్వాలి. నాకో అనుభవమైంది. ఎవరికీ చెప్పలేదు. అప్పుడు నా వయసు పద్దెనిమిది. నన్ను కట్నం లేకుండా ఒకడు చేసుకోడానికి ఇష్టపడ్డాడు. ఒకటి, రెండుసార్లు కలిసాక ఆ ఇష్టం కలిగింది. కాని మేము వాడి తెగవాళ్ళం కాదని వాడి తల్లితండ్రులు మా పెళ్ళికి ఒప్పుకోలేదు. వాళ్ళని ఎదిరించలేకపోయాడు. రెండేళ్ళు కుమిలిపోయాను."

"వాడంటే నీకింకా ప్రేమ ఉందా?"

"లేదు. వాడికి ఇంకొకరితో పెళ్ళై పొయ్యాక అది చేత్తో తీసేసినట్లు పోయింది."

"ద్వేషం?"

"ఇతరులు మనల్ని నిరాశపరిచారని వాళ్ళని నిందించకూడదు. నిజానికి వారినించి ఎక్కువ ఆశించినందుకు మనల్ని మనం నిందించుకోవాలి. లేదు. ద్వేషంలేదు" అనస్థాషియా నవ్వుతూ చెప్పింది.

తను చదివిన ఓ పుస్తకంలో చైత్ర అండర్‌లైన్ చేయకపోవడంతో తను అండర్‌లైన్ చేసిన పేరా గుర్తొచ్చింది.

'నీ చేతిలో టీ కప్పు ఉండగా నీ కొడుకు పరిగెత్తుకు వచ్చి నిన్ను తాకాడు. ఏం జరుగుతుంది? నీ చేతిలో కప్పులోని టీ వలుకుతుంది. అవునా? గుడ్. అప్పుడు నీ గ్లాస్‌లో లెమనేడ్ ఉంటే అదే చిందేది. వైన్ ఉంటే అది. అలాగే నీ జీవితంలో ఏదైనా నిన్ను కుదిపితే, నీలో ఏవుంటే అవే బయటికి రావడం ఖాయం. ద్వేషం, , కోపం, శతృత్వం, పగ, నిరాశ ఉంటే అవే బయటకి వస్తాయి. నీలో ప్రేమ, దయ, సానుభూతి, అర్థం చేసుకుని క్షమించడం లేదా ఆనందం, శాంతి, నమ్రత, కృతజ్ఞతలుంటే అవే బయటకి వస్తాయి. నువ్వేం నింపుకుంటే అవే టీ లా, లెమనేడ్ లేదా వైన్‌లా బయటకి వస్తాయి.'

ఆద్యకి ఆ వివరణవల్ల తనని తను పరిశీలించుకునే ఆలోచన కలిగింది. తనలో నిరుత్సాహం, నిరాశ, విషాదం నిండి ఉండడంతో అవే బయటికి వచ్చాయన్న అవగాహన కలిగింది. అది నిజమే అన్నట్లుగా తన ముందో జీవించి ఉన్న ఉదాహరణ ఆమెకి కనిపించింది. ఈమెది ఎంత పాజిటివ్ ఏటిట్యూడ్ అని ఆద్యకి వెంటనే అనిపించింది.

"నువ్వు చాలా మంచిదానివి అనస్థాషియా. నీనించి నేనో మంచితనాన్ని నేర్చుకున్నాను" ఆద్య మనస్ఫూర్తిగా చెప్పింది.

"గెలిచినప్పటి కంటే ఓడినప్పుడే నువ్వు ఎక్కువ తెలుసుకుంటావని మాకో సామెత ఉంది. కాని మీ జడ నా జుట్టుకన్నా అందంగా ఉంది. కాబట్టి మీరే గొప్పవారు" అనస్థాషియా తన స్థాయిలో జవాబు చెప్పింది.

ఆ సాయంత్రం చైత్ర ఆఫీస్‌నించి వచ్చాక చెప్పింది.

"ప్రతీ శుక్రవారం రాత్రి మాకు పాట్‌లక్ పార్టీ ఉంటుంది. కిందటి వారం కొందరు ఊళ్ళోలేక కాన్సిలైంది. నా కొలీగ్స్‌లో లైక్ మైండెడ్ అంతా దాంట్లో కలుస్తాం. ఒకోసారి ఒక్కొక్కరింట్లో జరుగుతూంటుంది. పనిరోజుల్లో ఒకరితో మరొకరం పని గురించి తప్ప ఇంకేం మాట్లాడం. నో ఛిట్‌ఛాటింగ్ ఇన్ మొబైల్స్. అది ప్రతీ మల్టీనేషనల్ కంపెనీ వర్క్ ఎథిక్స్. వీకెండ్‌లోనే మాకు మాట్లాడుకునే అవకాశం ఉంటుంది. ఇంక ఈ చిన్న ఊళ్ళో వేరే రిలాక్సేషన్ కూడా లేదు. ఒకరినించి మరొకరం చాలా కొత్త విషయాలు నేర్చుకుంటూంటాం. మా మీట్‌లో అనేక దేశాలకి చెందిన అరడజను మందికి పైగా వస్తారు. ఇట్ విల్ బి ఇంట్రెస్టింగ్ ఫర్ యు. ఈ సారి మనం ఏం చేసి తీసుకెళ్దాం?"

"వాళ్ళు ఎలాంటివి తింటారో" ఆద్య సందేహంగా అడిగింది.

"నేనోసారి పులిహోర తీసుకెళ్ళాను. వాళ్ళ తిండి పదార్థాల్లో పులుపు, కారం పెద్దగా ఉండవు కాబట్టి ఇష్టంగా తిన్నారు. మరోసారి పొంగల్. 'అన్ సాల్టెడ్ బటర్' ని కాస్తే నెయ్యి అవుతుంది. దాంతో చేసాను. నువ్వేం వండగలవు?"

"సేమ్యా పాయసం."

"మనకిక్కడ సేమ్యా, సగ్గుబియ్యం దొరకవు. బెల్లం కూడా. ఇంకేదైనా చెప్పు."

"బజ్జీ?"

"వెరీ గుడ్. అది వీళ్ళకి నచ్చుతుంది. నువ్వు శనగపిండి తెచ్చావా?"

ఆద్య అప్పుడు గుర్తువచ్చినట్లుగా పెట్టె తెరచి తనతో తెచ్చిన పదార్థాలని బయటకి తీసింది.

"ఓ! మేగీ తెచ్చావా? ఈ పూట ఎగ్‌మసాలా మేగీ వండుకుందాం" చైత్ర ఆనందంగా చెప్పింది.

"నీకు చాప్‌స్టిక్స్ ఉపయోగించడం ఇంకా రాలేదా?" నూడుల్స్‌ని ఛాప్‌స్టిక్స్‌తో తినే చైత్ర ఫోర్క్‌తో తినే చెల్లెల్ని అడిగింది.

ఆద్య తల అడ్డంగా ఊపింది.

"తేలిక. మొదటి చాప్‌స్టిక్‌ని పెన్‌లా చూపుడు వేలు, బొటన వేళ్ళతో ఇలా పట్టుకోవాలి. రెండోదాన్ని ఆ రెంటి రంధ్రంలోంచి ఇలా మధ్య వేలుకి ఆనించి పట్టుకోవాలి. కింద పుల్లని కదపకుండా పైది మాత్రమే చూపుడు, బొటనవేళ్ళతో

కదపాలి. ఇలా. ఇట్ టేక్స్ ప్రాక్టీస్. శెనగబద్దల్ని ఓ కప్పులోంచి తీసి ఇంకో కప్పులోకి వేస్తున్నావు కదా. తొందరలోని చేతవుతుంది."

చైత్రకి ఓ టెక్స్ట్ మెసేజ్ వచ్చింది. దాన్ని చూసి ఆమె కొంత ఆందోళనకి గురైంది. ఓ నంబర్‌కి డయల్ చేసింది.

"హలో శామ్యూల్. నువ్వింకా ఆ జనరేటర్ వర్క్ చూడలేదెందుకు? మరి దాని స్పేర్ పార్ట్స్‌కి రిక్విజిషన్ పంపావా? ఎందుకు పంపలేదు? దటీజ్ నో ఎక్స్‌క్యూజ్. క్లైంట్‌కి ఆలస్యానికి మనం బాధ్యులం అవుతాం. లెట్ మీ గివెన్ ఎగ్జాంపుల్. నువ్వు పక్కలో ఉన్నావు. అకస్మాత్తుగా బాత్‌రూముకి వెళ్ళాల్సి వస్తుంది. బయటంతా చలి. దుప్పటికింద హాయిగా పడుకుని ఉన్నావు. బాత్‌రూంకి వెళ్ళకుండా కాసేపు పడుకుంటావు. కొద్దిసేపు పక్కమీద దొర్లాక చివరకి బాత్‌రూముకి వెళ్ళి తీరాల్సి వస్తుంది. లేదా నీకు నిద్రపట్టదని తెలుసు. నువ్వు పక్కమీద దొర్లుతూ సమయమంతా వృధా చేయకుండా ఆ పని మొదట్లోనే చేసుంటే కాలం వృధాకాకుండా హాయిగా నిద్రపోయేవాడివి. అవునా? నువ్విప్పుడు చేసిన పని అదే. బాత్‌రూంకి వెంటనే వెళ్ళలేదు. వెంటనే రిక్విజిషన్ పంపి నాకు కన్‌ఫం చెయ్యి. ఇలాగే నీ జీవితంలో ఏదైనా సమస్య వస్తే, అది ఇల్లు, ఆఫీస్ లేదా మరేదైనా కావచ్చు. దాన్ని వాయిదా వేయకుండా వెంటనే పరిష్కరించుకోవాలి. దట్స్ హౌ యు గ్రో ఈదర్ ఇన్ లైఫ్ ఆర్ ఇన్ జాబ్. థాంక్స్. గుడ్‌నైట్ మిస్టర్ శామ్యూల్."

చైత్ర ఇండియానించి బయటకి వెళ్ళాక చాలా నేర్చుకుందని, చాలా ఎదిగామని ఆద్య మరోసారి అనుకుంది.

శుక్రవారం ఉదయం నిద్రలేచాక చైత్ర అద్దం మీద అతికించిన పోస్టిట్ నోట్ చదివింది.

"రాత్రి ఏడుకి మీట్‌కి వెళ్తున్నాం. అది కార్లోస్ లోపెజ్ ఇంట్లో జరుగుతోంది. అతను మెక్సికన్. నేను నాలుగున్నర, అయిదులోగా వచ్చేస్తాను. ఆ పాట్ లక్ పార్టీకి వెంట తీసుకెళ్ళే బజ్జీలని కలిసి చేద్దాం."

సాయంత్రం చైత్ర ఆఫీస్ నించి సాయంత్రం నాలుగుకే వచ్చేసింది.

"ప్రతీ ఫ్రైడే సాయంత్రం అంతా హాలిడే మూడ్‌లోకి వెళ్ళిపోతారు. నా కింది వాళ్ళతో స్ట్రిక్ట్‌గా వ్యవహరించని రోజు ఈ ఒక్కరోజే. అంతా నాలుగుకి జారుకోవడం మొదలెడతారు" చైత్ర నవ్వుతూ చెప్పింది.

"ప్రతీ శుక్రవారం ఈ టైముకే వచ్చేస్తావా?"

"ఊహూ. మీట్ లేకపోతే ఆరుదాకా తప్పనిసరిగా ఆఫీసులో ఉండి పనిచేస్తాను. బజ్జీల పని చూసి, తర్వాత వంటలక్క డ్రస్‌లోంచి మిస్ యూనివర్స్ డ్రస్‌లోకి మారుదాం."

"చైత్ర ఉల్లిపాయల్ని కడిగి, రెండువైపులా కొద్దిగా కొసి అరనిమిషం మైక్రోవేవ్ ఓవెన్‌లో ఉంచి వేడిచేసి చెల్లెలికి చెప్పింది.

"ఇలా చేస్తే కోసేప్పుడు కళ్ళవెంట నీళ్ళు కారవు. సల్ఫ్యూరిక్ గేస్‌ని విడుదల చేసే గేస్‌ని ఈ ప్రక్రియ నష్టపరుస్తుంది."

చైత్ర ఉల్లిపాయలు, అరటికాయలు, బంగాళా దుంపలు, వంకాయ చక్రాలుగా కోసింది.

"అరటి పళ్ళ బజ్జీలు కూడా వేస్తారా?" చైత్ర అరటి పళ్ళని కోస్తూండటంతో ఆద్య ఆశ్చర్యంగా అడిగింది.

"అవును. బావుంటాయి.కేరళలో వేస్తారు. వాటిని నేంద్రం పజం అంటారు. వీటికోసమే అమ్మని నీతో శెనగపిండిని పంపమంది. జమైకాలో కూడా ఈ బజ్జీలు వేస్తారు. వెనెజువెలా, కొలంబియాలో బజ్జీలని మొక్కజొన్న పిండితో వేస్తారు."

"తెలంగాణాలో కొన్ని చోట్ల మిర్చి బజ్జీలని మొక్క జొన్న పిండితో వేస్తారు. అది నాకు నచ్చదు."

వాళ్ళని ఎక్కించుకోడానికి ఎన్రికో తన కారులో వచ్చాడు. పావుగంట డ్రైవ్ దూరంలోని కార్లోస్ లోపెజ్ ఇంటికి చేరుకున్నారు. దారిలో చెల్లెలికి చెప్పింది.

"కార్లోస్ మెక్సికన్ ఐనా పూర్వీకులు ఫ్రెంచ్ వారు. యూరోపియన్స్ క్లబ్ కల్చర్ ఎక్కువ. ఒకే అభిరుచి గలవారు తరచు కలుస్తూంటారు. అలా కలిసినప్పుడు డ్రింక్స్, ఫుడ్ తప్పనిసరి. ఒకరినించి మరొకరు కొత్తవి తెలుసుకుంటూంటారు. మేమంతా ప్రపంచంలోని అనేక దేశాల్లో పనిచేసాం కాబట్టి మేము పని చేయని దేశాల గురించి తెలుసుకోవడానికి ఈ మీట్ మాకు ఉపయోగిస్తుంది. ఇక్కడి ఎక్స్‌పాట్రియట్స్ ఇంకా బేకర్‌హ్యూజ్. వెదర్‌ఫోర్ట్‌లాంటి ఆయిల్ అండ్ గేస్ కంపెనీల్లో పనిచేస్తున్నారు. లైక్ మైండెడ్ వారంతా కలివిడిగ ఉంటారు. అభిరుచిని బట్టి టెన్నిస్ క్లబ్స్, గాల్ఫ్ క్లబ్‌లలో చేరతారు."

ఆ ఇంట్లో ఉండేది కార్లోస్ ఒక్కడేనని ఆద్యకి అర్థమైంది. అప్పటికే అక్కడ ఉన్నవాళ్ళు చైత్రని పలకరించి హగ్ చేసుకున్నారు. చైత్ర ఆద్యని వాళ్ళకి పరిచయం చేస్తే వాళ్ళు ఆమెని కూడా హగ్ చేసుకున్నారు. అతిథులు తెచ్చిన మాంసంతో చేసిన డిషెస్‌ని, మద్యం బాటిల్స్‌ని ఓ బల్లమీద ఉంచారు. చైత్ర తనతో తెచ్చిన వైన్ సీసాని అక్కడ ఉంచింది. ఆద్య బజ్జీల బౌల్‌ని వాటి పక్కన ఉంచింది.

"బాన్‌జూర్ పియర్. ఇతను పియర్. ఫ్రాన్స్‌లోని నీస్ నించి వచ్చాడు. నా చెల్లెలు ఆద్య" చైత్ర ఒకతన్ని పలకరించి చెల్లెలికి పరిచయం చేసింది.

"బాంజో. నైస్ మీటింగ్ యు మిస్ ఆద్య" అతను పలకరింపుగా హగ్ చేసుకుంటూ చెప్పాడు.

"బాంజో అర్థం ఫ్రెంచ్ భాషలో హలో అని. ఇండియన్ ప్రొనౌన్సియేషన్ బాన్‌జూర్. ఫ్రెంచ్ ప్రొనౌన్సియేషన్ బాంజో" చైత్ర ఆద్యకి ఇంగ్లీష్‌లో వివరించింది.

ఎంట్రన్స్‌లో బల్లమీద ఉన్న జిప్ బేగ్‌ని, మార్కర్ పెన్‌ని తీసుకుని అందులో చైత్ర తన సెల్‌ఫోన్‌ని ఉంచి మూసి, తన పేరుని రాసి ఆ ట్రేలో పడేసింది.

మరికొందరిని చైత్ర చెల్లెలికి పరిచయం చేసింది.

"మిస్ గాడా బార్బ్వర్, లిబియన్. మిస్టర్ ఇఫియాని వాగ్‌బోగు, నైజీరియన్. షి ఈజ్ మిసెసి ఇఫియాని. వీరిది పక్కదేశమే. మిస్టర్ జై బి వూ, చైనీస్. పెళ్ళైంది కాని పిల్లల చదువుకోసం ఇతని భార్య అక్రాలో ఉంటోంది. వాళ్ళక్కడ ఇంటర్నేషనల్ స్కూల్లో చదువుతున్నారు. టకరోడీలో ఆ సౌకర్యం లేదు. కాబట్టి ఇక్కడ సింగిల్ లేదా పెళ్ళై పిల్లలు లేనివారే ఉన్నారు. పిల్లలున్నవాళ్ళు అక్రాలో పని చేస్తారు. మిస్టర్ సిమోనే రెన్నో, బ్రెజిల్. మిస్టర్ క్రిస్ స్మిత్, కెనడా. మిస్ క్రిస్టీనా లోపెజ్. పెరూ. మిస్టర్ ఏండ్రూ మిల్స్, స్కాట్‌లేండ్. మిస్టర్ లివియూ హుతోషి, రుమేనియన్. మిస్టర్ కునూట్, నార్వేజియన్."

క్రిస్ స్మిత్ అందగాడని ఆద్య అనుకుంది.

"ఖాలెద్ గురించి తెలిసిందా?" చైత్ర అడిగింది.

క్రిస్ విచారంగా తల అడ్డంగా ఊపాడు.

"హలో ఫిష్. వెల్‌కం" ఓ యువకుడ్ని కౌగలించుకుని క్రిస్ ఆహ్వానించాడు.

"అతని పేరు సల్మాన్. సాల్మన్ అనే చేపని వాళ్ళు తింటారు. కాబట్టి అతనికి ఫిష్ అనే నిక్‌నేం పెట్టారు. ఇతను హాలీబరటన్ అనే మా పోటీ ఆయిల్ కంపెనీలో పనిచేస్తున్నాడు. అందులో జార్జ్ బుష్‌కి షేర్లున్నాయి. సల్మాన్ తండ్రి పంజాబీ. పాకిస్థాన్‌లో కూడా పంజాబ్ ఉందని తెలుసా?" చైత్ర అడిగింది.

"ఊహు."

"పంజాబ్‌లోని కొంతభాగం పాకిస్థాన్‌కి వెళ్ళింది. తండ్రి పంజాబీ, తల్లి పఠాన్. కొడుక్కి ముస్లిం పేరు కూతురుకి హిందూ పేరు పెట్టారు" చైత్ర చెప్పింది.

"ఇవి చాలా బావున్నాయి. ఈ స్వీట్ బనానా ఫ్రిటర్‌ని కొలంబియాలో చేస్తారు" బజ్జీని తిన్న ఎన్రికో చెప్పాడు.

"టేస్టీ. తినే పని వాకింగ్ లా బరువు తగ్గేదైతే ఎంత బావుండేది" అలెక్స్ వాటిని తింటూ చెప్పాడు.

కొద్దిసేపటికి అల్జీరియన్స్ మిస్టర్ సమీర్ టెర్గినీని, అతని భార్య, ఇండోనేషియన్ వెరా విబావ వచ్చారు.

"మనకి ఆద్య కొత్తవ్యక్తి కాబట్టి 'కాన్వర్జేషన్ బ్రేకర్' ఆటని ఆడటం సమజసంగా ఉంటుందేమో?" క్రిస్ స్మిత్ సూచించాడు.

"నేనూ సరిగ్గా అదే అనుకున్నాను. కాని మొదటివి ముందుగా. లెట్స్ సే ఛీర్స్" చెప్పి కార్లోస్ అలమార తెరచి నాలుగైదు రకాల మద్యాల సీసాలని గ్లాసుల ట్రేని, సోడామేకర్ యంత్రాన్ని, ఛీజ్, బ్రెడ్‌లని టీపాయ్ మీద పెట్టాడు.

"ఖాలెద్ గురించి తెలిసిందా?" చైత్ర అడిగింది.

"పూర్ గై. తెలీలేదు."

"వెస్ట్రా సాలూత్" కార్లోస్ గ్లాస్‌ని పైకి ఎత్తి చెప్పాడు.

"టు యువర్ హెల్త్ అని. స్పేనిష్‌లో" చైత్ర చెల్లెలితో చెప్పింది.

గ్లాసులు కలుసుకుని చప్పుడు చేసాయి.

ఒకామె ధరించిన టీ షర్‌మీది చైనీస్ లిపిని చూసి జై బై వూ నవ్వుతు అడిగాడు.

"ఇది ఎక్కడిది?"

"ఓ చైనీస్ రెస్‌రెంట్లోని మెనూలో చక్కటి చేతిరాతతో ఇది ఉందిట. నచ్చి, దాన్ని మా అమ్మ ఫోటో తీసుకుని దీనిమీద ప్రింట్ చేయించింది. అంతా దీన్ని మెచ్చుకున్నారు."

"దానర్థం 'ఇది చవక డిష్ ' అని" అతను నవ్వుతూ చెప్పాడు.

కార్లోస్ లోపలకి వెళ్ళి పేకముక్క పరిమాణంలోని కార్డులున్న పెట్టెని తెచ్చాడు. దాన్ని ఎలా ఆడాలో వివరించాడు.

"ఈ ఆట పేరు 'కాన్వర్జేషన్ స్టార్టర్' ఆద్యా. 'అన్‌కవర్ టు డిస్కవర్ ' అని కూడా అంటారు. ప్రతీ కార్డులో ఓ ప్రశ్న ఉంటుంది. దానికి అంతా సమాధానం చెప్పాలి. ఉదాహరణకి ఏ సంగీత పరికరాన్ని ఇష్టపడతావు? అనే ప్రశ్నకి అంతా జవాబు చెప్పాలి. లేదా నీ బాల్యమిత్రుల్లో ఎవరు గుర్తున్నారు? ఎందుకు? రౌండ్‌గా కూర్చున్నాం కాబట్టి ఒకరు తర్వాత మరొకరు ప్రతీ ప్రశ్నకీ జవాబు చెప్పాలి. గాటిట్?"

"ఎస్. థాంక్స్. గాటిట్" ఆద్య చెప్పింది.

"లెట్స్ గెట్ స్టార్టెడ్ ప్రోంటో."

ఆద్య తీసిన మొదటి కార్డులో వచ్చిన ప్రశ్న. 'టైం ట్రావెల్‌కి అవకాశం వస్తే ఎవర్ని వెళ్ళి చూస్తావు?'

"క్లియోపాత్రా. ఆమె ఎంత అందగత్తో తెలుసుకోవాలని ఉంది" ఆమె ఆలోచించి చెప్పింది.

"చాణుక్యుడు. రాజకీయ చౌరతలో ఆయన మాకియవెల్లీతో సమానం అంటారు"చైత్ర చెప్పింది.

"నిప్పుని కనిపెట్టిన వ్యక్తిని చూస్తాను. అది కాలినప్పటి వాడి స్పదనని చూడాలని ఉంది" ఇఫియాని నవ్వుతూ చెప్పాడు.

"అవును. మనిషి అభివృద్ధికి అదో మూలం. ఇడీ అమీన్. అంత క్రూడితో మాట్లాడాలని ఉంది" వెరా చెప్పింది.

"నా పుట్టుకకి ఆద్యులైన మొదటి జంటని" కునూట్ చెప్పాడు.

అంతా సమాధానాలు చెప్పాక తర్వాతి ప్రశ్నని లివియూ హుతోషి తీసాడు. 'మీ నాన్నతో నీకు గుర్తున్న అనుభవం ఏమిటి?'

అతను కొన్ని క్షణాలపాటు ఆలోచించి చెప్పాడు.

"నా ఆరో ఏట నేను నిక్కర్లో యూరిన్ పోసుకుంటే మా టీచర్ మా నాన్నకి ఫోన్ చేసి, వచ్చి నన్ను తీసుకెళ్ళమని కోరింది. మా నాన్న తన పేంట్ ముందు భాగాన్ని నీళ్ళతో కొద్దిగా తడుపుకుని నన్ను తీసుకెళ్ళడానికి వచ్చాడు. ఏదో

ఘోరమైన తప్పు చేసానని సిగ్గుపడే నాకు అది చూపించి చెప్పాడు. 'నీ బేగ్ ఇవ్వు. అడ్డం పెట్టుకుంటాను' ఆ విధంగా నేను అవమానం ఫీలవడాన్ని పోగొట్టాడు."

అంతా చప్పట్లు కొట్టారు.

"వండ్రఫుల్ ఫాదర్" మిస్ గాడా బార్బ్యార్ కాంప్లిమెంట్ చేసింది.

"పాస్." క్రిస్టీనా లోపెజ్ చెప్పింది.

"మా నాన్నతో నాకు చాలా అనుభవాలు ఉన్నాయి. నా పదహారో ఏట జరిగింది వెంటనే గుర్తువచ్చింది. నాకు డ్రైవింగ్ లైసెన్స్ వచ్చింది. మా నాన్న కేడిలాక్ కారుని నడపాలనే కోరిక నాలో తీవ్రంగా ఉండేది. పది డాలర్లని ఇచ్చి నన్ను అందులో పెట్రోల్ పోయించి తీసుకు రమ్మని పంపారు. నేను గర్వంగా ఆ కారులో పెట్రోల్ బంక్‌కి వెళ్ళి కారుని లోపలకి మలుపు తిప్పుతూంటే అక్కడ ఇటుకల స్థంభాన్ని కారు రాసుకుంది. దిగి చూస్తే ఓ చోట గీరుకుపోయింది. దాన్ని మా నాన్న చూస్తారనే భయం, నాకు సరిగ్గా డ్రైవింగ్ రాదని భావించి ఇక నాకు ఎన్నడూ తన కారుని ఇవ్వరనే అనుమానం కలిగాయి. నేను ఇంటికి చేరుకోగానే మా నాన్నకి జరిగింది చెప్పాను. ఆయన బయటకి వచ్చి కారుని చూసారు. ఏం తిడతారా అని భయంగా చూస్తూంటే, ఆయన తన జేబులోంచి పర్స్ తీసి, పదిడాలర్లని నాకు ఇచ్చి చెప్పారు. 'వెళ్ళి ఇంకో పది డాలర్ల పెట్రోల్ కొట్టించుకురా" స్మిత్ చెప్పాడు.

"మా నాన్న అంత అండర్‌స్టాండింగ్‌గా ఉంటేనా?" సల్మాన్ చెప్పాడు.

అలెక్సీ తన తండ్రితో అనుభవాన్ని చెప్పాడు.

"రష్యా సర్కస్‌లకి ప్రసిద్ధి కదా. అప్పుడు నాకు ఎనిమిది, మా అన్నయ్యకి పదకొండు. మా నాన్న సర్కస్‌కి తీసుకెళ్తానని మాట ఇచ్చాడు. కాని లంచ్ టైంలో అర్జెంట్ పని ఉందని ఆఫీస్‌నించి ఫోన్ వచ్చింది. అది సర్కస్ ఆఖరి రోజు కాబట్టి మేం నిరాశకి గురయ్యాం. కాని మా నాన్న ఫోన్‌లో వాళ్ళకి చెప్పింది నాకింకా గుర్తుంది. 'లేదు. నేను రాలేను. నాకు అర్జెంట్ పనుంది'. అది విన్న మా అమ్మ 'వెళ్ళు. సర్కస్ మళ్ళీ మళ్ళీ వస్తూంటుంది' అని చెప్పింది.

'అది నాకు తెలుసు. కాని బాల్యం మళ్ళీ మళ్ళీ రాదు' అని మా నాన్న చెప్పారు. ఆ మాటలు నాకు ఎన్నో బోధించాయి. ఇచ్చినమాట తప్పకూడదని, కుటుంబం అన్నిటికన్నా ముఖ్యం అని. ఇంకా ఎన్నో. ఇలియా. నువ్వు."

"వండ్రఫుల్ డేడ్" జై బై వూ చెప్పాడు.

"ఓ మేడే న నేను నా చిన్నతనంలో మా నాన్నకి రాసిన ఉత్తరాన్ని నాకు డెలివరీ అయ్యాక చూపించారు. అందులో, 'డేడ్! నీలో నేనో చెడ్డ అలవాటుని గమనించాను. ఓసారి నేనో కథ చెప్తూంటే మధ్యలో నువ్వు వెళ్ళిపోయావు. ఇవాళ నేనో పాట పాడుతూంటే నువ్వు స్నానానికి వెళ్ళిపోయావు. నన్ను ఇలా అవమానించినందుకు నేను నీతో రెండు రోజులు

మాట్లాడను. నీ సేడ్ డాటర్' అని రాసుంది. నాన్నంటే తన కుటుంబానికి ఉప్పుని సంపాదిస్తూ, తను చక్కెరని తినలేకపోయేవాడు" ఇలియా చెప్పింది.

మరికొందరు చెప్పాక తర్వాతి కార్డ్‌ని తీసారు. "నువ్వు చేసిన అతి హీనమైన ప్రయాణం ఏమిటి?"

"నేను చెప్తాను" వెంటనే అలెక్సీ చెప్పాడు.

ఓ చిరునవ్వు అలెక్సీ పెదాలమీద మెరిసింది.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**
www.anandbooks.com
www.telugubooks.in

Post your comments